# గ్యాంగుమన్ గంగయ్య

తెల్లతెలవారుతూండగానే, గ్యాంగుమన్ గంగయ్యలేచాడు బుడ్డి దీపం, గుడ్డి వెలుతురులో! గుడిసె అంతా మసక మసకగా వుంది. క్రింద చాపమీద ముసిల్ది ముడుచుకు పడుకుంది. పక్కమీద కూర్చునే బీడీ ముట్టించాడు. లోపల కొంచెం వేడి పుట్టేసరికి, ముసుగు పైటకు లాగి, లేచి గదిలో ఓ మూలకుపోయి వెతకడం ప్రారంభించేడు.

ముసిల్ది అట్నుంచి ఇటు వత్తిగిలి...

"ఏ వెతుకుతున్నావేటి?" అని అడిగింది...

"అయ్యేనె, సుత్తీ జండాకర్రలూ, స్కేలు బద్దా" అంటూనే పకాల్ను నవ్వేసేడు...బోసి నోట్లోంచి బీడీక్రింద పడిపోయింది.

కలొచ్చినాదేటి ఒల్లాక తొంగోక అని గసిరేసింది.

"అవునొసే లచ్చి...అదేటోగాని నౌకరి చేసినన్నాల్లూ రిటైరై పోతే బావుణ్నని పిస్తది...రిటైరయి పోనాక...అయ్యో అనిపిస్తది. రిటైరయినాకా నాకింకా అదే తను పొగ్గనేదు...రేత్రి ఒకంతగ్గాని నిద్రొట్టదు. మరి గంటే...సీకటేళకి తెలివొచ్చేస్తది ! సిత్రంగా వుంది" అని అంటూ బీడీతీసి మళ్ళీ ముట్టించాడు.

"బావుంది! పనిసేసి సేసి యెంటనే మానేసినోడికి కొన్నాళ్ళట్టగే అనిపిస్తది! అదే అలవాటవుద్దిలే!"

"కాదుగాని నచ్చి! నాకు రాత్రంతా ఒకటే కల. మనసు తేలిపోనా దనుకో !"

"ఓలబ్బో ఏటంత సంబడం ! ఏటి సూసుకు తేలిపోవాలంట ? సుక్కేసు కొచ్చావు లాగుంది!" అని యీసడించింది.

"ఒల్లకోవే నీ కెప్పుడూ యెటకారమే...కంపెనోరు మన పాయి డెంటు అంతా యిచ్చేసినారంట. ఆ డబ్బెట్టి పట్నంలో ఇల్లు కట్టినామంట "నారిగాడికి గాంగులో ఏసినారంట. మరి గంటే మన సీతాలుకి సమ్మం దం కుదిరిందంట" అని కులాసాగా చెప్పుకుపోతున్నాడు.

"యిక సాల్లే సోది...అర్నెల్ల పొద్దెయింది. రిటైరయి యిప్పటి కింకా ఆ డబ్బు చేతికందనేదు...సేసినన్నాళ్ళు సాకిరీ సేయించుకొని ఆ గవర్నమెంటోళ్ళుదబ్బిచ్చేయాలకి ఈ తిప్పలెందుకెడతారంట? నువ్వేమో ఓ లబ్బో! నీ కబుర్లు సూత్తే ఆకాశ మంతెత్తున్నాయి !"

"అదే నాకూ తెలవడంనేదే! ఎపుడో 'చౌకీదారి' పని చేసినానంట అప్పుడు ఇనపకమ్మీ ఒకటి పోయినాదంట, ఆర్. పి. ఎఫ్. ఓళ్ళు కేసెట్టి నారు. నేనమ్ముకు తిన్నానని పట్టించినారు. నేను మొర్రో అంటే యిన్రు కదా...ఆ కేసు తేలితేనేగానీ డబ్బివ్వరంట."

"ఆ డబ్బేదో కోసుకొని మిగతాది యిచ్చేమన్లేక పోనావా పీడా దిలి పోద్ది! అలానే బాగుపడని—ఏటి పేచీ ఇన్నాల్లూ. ఏటి తింటన్నా మనుకున్నారు ! గంజి నీళ్ళన్నా తాగాలా...పెద్దోడు చూస్తే కానీ లేకండా తిరుగుతున్నాడు. ఇన్నాల్లయి నౌకరీ సేసినావుగందా ఎవురి కాళ్ళన్నా ఒట్టుకొని ఆడిపేరు ఏయించనేక పోయినావు...ఎట్టైనా అంటే రోసం వస్తది" అని ఏకరువు పెట్టింది.

"నువ్వు సెప్పింది సత్తెంసచ్చిన ఆల్లకాళ్ళకి మొక్కినా. ఇంటి సాకిరీ సేసినా ! సేయించుకొనే వోరేగా ! ఉపకారమనే సరికి యిట్టాగే వుంటాది. నేనేటి సేసేది...అప్పటికి ఏదో నాకు తోసింది ముట్టచెబుతా బాబూ అని హాజీరుబాబుకి సెప్పి చూసాను 'నా ఇల్లు నిలబెట్టు' బాబూ అని బతిమిలాడుకున్నాను. కాని ఇచ్చిందేదో మింగేసి ముంగిలా పూరు కుంటాడాయె."

ఇలా ఇద్దరూ మాటల్లో పడేసరికి...ప్రక్కనుండి వాళ్ళున్న పాకని వూపేస్తూ పెద్ద శబ్దం చేసుకుంటూ ప్యాసింజరు వెళ్ళిపోయింది.

"ఓలబ్బో! పొద్దెక్కి పోతావుంది. అప్పుడే పాసింజరు బండి వెళ్ళిపోనాది! లెగే...లెగే..."

"ఏటా తొందర... పెద్ద...నౌఖరికి ఏలయిపోతున్నట్టు..."

"మరచిపోయావేటే!...నువ్వేనా సుబ్బినాయుడింటి కెళ్ళమంది" అరి సిన్నోడు బెంపరివరిగా—లోకోలో—చేరినాడంట...ఎల్లి మాటా డొద్దామని..."

"అట్టాగా—మరిగంటె సెప్పవేం...వుల్ల య్యేవారం సెయ్యకండా కడంటా మాటాడి కుదుర్చుకురా—" అంటూ లేచి గూట్లో ఎక్కడో దాచిన పది పైసలు తీసి యిస్తూ-

"ఇంద ఎల్లేమ్మ కొట్టుకాడ—టీ చుక్కతాగి మరీఎల్లు!" అని అంది.

"ఎక్కడ దాస్తావేటి నిన్న బీడిముక్కకి అడిగితే నేదన్నావుగా!" అని గొణుక్కుంటూ బయలుదేరాడు.

ఏ మాష్టరు బాబునో అడిగి సంపాదించిన నల్లకోటు ఆప్యాయంగా వేసుగున్నాడు. వున్నదాంట్లో మంచి పంచె కట్టుగున్నాడు. ఎర్ర తలపాగా చుట్టుగున్నాడు. రెండంగుళాల దళసరిని హైర్లు కుట్టించిన చెప్పులు వేసుగున్నాడు. కర్ర చేత పట్టుగొని బొద్దుమీసాలు దువ్వుకుంటూ బయలుదేరాడు

ఇవతల కొచ్చేసరికి వెలవెలబోతూ ఆ వేకువజాములో కనిపించే ప్రపంచంలాగే పాత చింకి చాపలాంటి తన జీవితమూ జ్ఞాపకము వచ్చింది గంగయ్యకి. అట్లా నడుస్తూ నెమరు వేసుగుంటున్నాడు.

చిరిగిన చాప ఎంత అతికితే బాగుండుతుంది? అది ఇంకా చిరిగి చిరిగి చిన్నదై పోతూనే వుంటుంది. తన జీవితమూ అంతే. ఈ రైల్వేలో

నౌఖరీచేసి, రక్తం, జవసత్వాలూ ధారపోసి బాగుపడింది ఏమిటా ? అని ప్రశ్నించుకున్నాడు.

రాత్రి అనక, పగలనక, ఎండనక, వాననక చేసిన శ్రమ, కర్పూరంలా అర్పించిన అస్థిపంజరం లాంటి తన శరీరమూ మిగిలాయి అంతే...

తాను పద్దెనిమిది రూపాయిల జీతంమీద ప్రవేశించాడు. అప్పటికి తన వయస్సెంత వుంటుందో కూడా తెలీదు. అదీ తన తండ్రి బ్రిడ్జిమీద పన్జేసూ వుంటే రైలుకిందపడి ఏక్సిడెంటులో చచ్చిపోయాడు. అప్పుడు తన తల్లి "దొరగారి" దగ్గర నెత్తీ, నోరూ బాదుకొని ఏడిస్తే యీ నౌఖరీ యిచ్చేరు. అది ఎలా వున్నా, అదొహటి వుంది... ఈ రైల్వేలో బాగున్నన్నాళ్ళు ఎంత ప్రయత్నించినా, ఉద్యోగం ఇవ్వరుగాని, తండ్రి పోతే కొడుక్కి, భర్తపోతే భార్యకి, కొన్ని కొన్ని ఉద్యోగాలలో యిస్తారు.

అలా ప్రారంభం అయింది గంగయ్య జీవితం...

ఆ రోజుల్లో ఆ పద్దెనిమిది రూపాయిలే రెండు వందల రూపాయల విలువచేసేవి. అందులో 'పే మెంటు' రోజున ఒక రూపాయి, పఠీలీరు బాబుకి యిచ్చేసినా హాయిగా కాలం వెళ్ళిపోయేది.

ఏమాట కామాట చెప్పుకోవాలి. స్వాతంత్రం వచ్చి పెద్దవాళ్ళు బాగుపడ్డారేమోగాని కూలి వాళ్ళకి కంపెనీ వాళ్ళ టైములోనే హాయిగా వుండేది. మొత్తం ప్రపంచం అంతా యుద్ధానికి అట్టుడికి పోయినా, కరువు దేశాన్ని ఎలా పీడించినా, ఉద్యోగస్తులకు మాత్రం కరువు కనపడలేదు.

గ్రయిను షాపు బండి వచ్చి కామధేనువులా కరువు లేకుండా ఆదుకొనేది.

"గ్రయిను షాపుల్లో పనిచేసే వాళ్ళని కూడా లక్షాధికారులను చేసింది !

రెండు రూపాయలు పెట్టి గ్రయిను షాపులో సామాన్లుగొని, పైన అమ్మితే-పదిరూపాయలొచ్చేది. అట్లా పెద్దవాళ్ళయిన వాళ్ళు కొంత మంది.

ఆ రోజుల్లో "దొర్ల" దగ్గర మంచిగా వుంటే ఎలాటి ఉద్యోగా లయినా యిట్టే వేయించేవారు...ఇప్పుడో "స్వీపరు" ఉద్యోగానిక్కూడా "సర్వీసు కమీషన్." ఇట్లా మారిపోయాయి రోజులు.

నిజానికి రైల్వేకి పునాది రాళ్ళవంటి వారు గ్యాంగుమెన్.

చీకటినే లేచి, చీకటి పడ్డాక ఇంటికి వస్తారు. రెక్కలు ముక్కలు చేసుగొని, ఇచ్చిన జీతానికి ఎక్కువ పని చేస్తారు. అయితే విచిత్రం ఏమంటే...అంత తక్కువ జీతం రైల్వేలో మరెవ్వరికీ లేదు.

గంగయ్య ముప్పై అయిదేళ్ళు సర్వీసు చేశాడు. ఆఖరికి డెబ్బై అయిదు రూపాయల మీద రిటైరయినాడు. జీతం ఎంతయినా...కోతలు పోగా, చేతికందేవి నలభై, ఏభై ...మరి సంసారం గడిచేదెలా.

ఎప్పుడూ పెద్దలోన్లూ, చిన్నలోన్లూ పెట్టడం "పేకర్సు" దగ్గర రూపాయికి బేడలు వడ్డీకి అప్పుతీసుకోడం జీతంలోకోతపోగా, పేకర్సు వడ్డీ పోగా మిగిలేది ముప్పై.

ఇంకా గంగయ్య నయం, కొందరికయితే కాబూలీవాళ్ళ దగ్గర అప్పులుండేవి. జీతాల రోజున వాళ్ళు అక్కడే కూర్చుని చేతిలో డబ్బం తటినీ గద్దలా తన్నుకుపోయేవారు. కొందరు సారాకొట్టు బాకీ సగానికి సగం తీర్చేసేవారు. ఈ రెండు అలవాట్లు గంగయ్యకు లేవుకాబట్టి కాస్త నయం! సరదాకి అప్పుడప్పుడు "సుక్క" వేసుకున్నా అది అలవాటు కాలేదు.

గ్యాంగులో ప్రవేశించాక పది పన్నెండేళ్ళు టెంపరరీగా చేస్తేనే గాని పెర్మనెంటు చేయలేదు—

విచిత్రం కాకపోతే చూడండి ఈ రోజుల్లో కూడా టెంపరరీవాడూ పెర్మనెంటువాడూ కలిసి ఒకే దగ్గర ఒకే పని చేస్తారు. ఇంకా టెంపరరీ

వాడు భయంకొద్దీ కష్టపడి ఒళ్ళొంచి పనిచేస్తాడు. పెర్మనెంట్ వాడయితే— "నా జీతం నాకిస్తారు" కదా అన్న ధీమాతో పని ఎగవేస్తాడు. అయినా టెంపరరీవాడికి ఏభై అయిదు రూపాయిలూ పెర్మనెంటువాడికి నూట ముప్ఫై రూపాయిలూ యిస్తున్నారు...గవర్నమెంటుకి తెలీదా? మరి ఈ పక్షపాతం ఎందుకో?

చేతికందొస్తాడు. ఏదో నాలుగురాళ్ళు తెచ్చుకుంటాడని పెద్దవాణ్ణి గ్యాంగులో వేయిద్దామని, అందరికాళ్ళూ పట్టుకున్నాడు. ఆఖరికి, పెద్ద దొరగారి యింట్లోని, చిన్న దొరగారి యింట్లోని, పోజరుబాబు ఇంట్లోని ఏ పని కావలిస్తే, ఆ పని చేసేవాడు. నీళ్ళు మోయడం, గొడ్లను చూడడం బజారుపని చేయడం, పిల్లల్ని ఆడించడం, ఒకటేమిటి అన్నిపనులూ చేసేవాడు...గ్యాంగు వాడికి గౌరవం ఏమిటి?

చెప్పిన పని చెయ్యకపోతే...పెద్దనుండి చిన్న దాకా, ఏం తిట్టిపోస్తారని! అబ్బ! అడవి మనుషులుకూడా అలాటి బూతులు తిట్టరేమో ఒక్కొక్కప్పుడు తిరగబడదామనిపించినా కడుపు జరగక అభిమానం- చంపుకొని పూరుకోవలసి వస్తుంది. ఎట్లాగో అట్లాగ వారి మంచి సంపాదించుకోనకపోతే చదువా, సంధ్యా బ్రతుకెలా గడుస్తుంది?

అయినా, కొడుకుకి ఉద్యోగం రాలేదు. కొడుకు చాతకూడా అన్నిపనులూ చేయించేడు...చేయించుకున్నవారేగాని, ఉద్యోగం ఇచ్చిన వారెవరూ కనబడలేదు.

ఎంతచేస్తేమిటి? ఎదుగా, బొదుగా, గ్యాంగుమన్‌గా చేరి...గ్యాంగ్ మన్‌గానే రిటైరయినాడు.

అప్పటికప్పుడే తెల్ల వారిపోయింది. దూరంగా కొండలవెనకనుంచి బంగారురంగు మేఘాలు మెరుస్తున్నాయి. ఆ కాంతికి రెలు పట్టాలు మెలికలు తిరిగిన పాములా కనబడుతున్నాయి. ప్రక్కపొలాలకన్నా ఎత్తుగా వున్నది లైను. ప్రక్కనే కాలిబాట క్రింద పొలాలప్రక్క నాలుగు బళ్ళు పోడానికి నాగుదారి వుంది. రైతులు పొలాల్లో పనులు

చేస్తున్నారు...బారులు తీరి కొంగలు, చెరువు గట్లమీద ప్రాలుతున్నాయి. చూడ్డానికి తెల్లకలువలు, విడినట్టున్నాయి. బెదురుతూ పారిపోతున్నాయి నక్కలు...అప్పటి కప్పుడే పదోనెంబరు గ్యాంగు పనిలోకి వచ్చేసేరు గ్యాంగుమేటు వెంకన్న పలకరించాడు...

"ఏం గంగయ్యా కులాసా? పొద్దాన్నే యిలా బయలుదేరేవేటి?"

"లక్ష్మింపురం ఎల్దామని బయల్దేరా...అక్కడ సీతాలుకి సంబంధం, సూసొద్దామని..."

"రిటైరయిపోయినా నీకింకా ఈ ఔడద లొగ్గనేదురా!" అని సానుభూతి చూపించాడు అడ్డ పొగ పీలుస్తూ.

"నేను సచ్చేవరకూ ఒదిలేట్టు లేదురా?" అని విరక్తితో జవాబిచ్చాడు.

"అన్నట్టు పెద్దోడేటి సేత్తన్నాడేటి?"

"ఏదీ ఆడిబతుకూ అట్టాగేవుంది...ఎవురి కాళ్ళాట్టుగున్నా ఏ మారాజూ ఏసుకోడంనేదు."

"నీ డబ్బంతా అందినాదా?"

"అదీ నేదు......యీ జీతాలకొత్తాయేమో సూడాల" అని అన్నాడు.

"సర్లే ఎల్లిరా గంగయ్యా!" అని తన పనిలోకి పోయాడు వెంకన్న.

ఆ ప్రక్కనే బెట్టుకొమ్మని తెంపి నోట్లో పెట్టుకున్నాడు.... వెంకన్నకి ఆ మధ్యనే గేంగుమేటుగా ప్రమోషను వచ్చింది. అతని కళ్ళ ముందు వచ్చిన గ్యాంగువాళ్ళే—కీమెన్లూ. గేంగుమేటులూ అయిపోయారు. అంతెందుకూ గేంగుమేటు కిష్టయ్య, పిడబ్ల్యూ. ఇన్‌స్పెక్టరు అయిపోయి క్రిష్ణారావు అయిపోయాడు. ఇప్పుడు—తను పని చేసిన గ్యాంగువాళ్ళ మీదే అతను అధికారి... ఇంక అప్పటి చిన్నవారలు యిప్పుడు ఆఫీసర్లు.

వాళ్ళ అదృష్టం అలా వుంది...జీవితంలో అందరికి ఏదో ఒక నాడు అదృష్టం తలుపు తడుతుంది...అతనికి తట్టింది...కాని శనిదేవత నెత్తిమీద తాండవించి అదికాస్తా తన్నుకు పోయింది.

కష్టం తనది ఫలితం మరొకరిది అయిపోయింది.

ఆ రోజు అతనికి బాగా జ్ఞాపకం వుంది. తన జట్టులో "కీమెన్" సిక్కు చేస్తే ఆ జాగాలో తనని టెంపరరీగా పనిచెయ్యమన్నారు.

వెంకన్నను చూసేసరికి ఆ సంఘటన గుర్తు కొచ్చింది.

ఆ రోజు ఇట్టాగే గేజ్ బద్దా, పటకారు, సుత్తీ, జండాలూ అన్నీ పట్టుగొని ఉదయాన్నే బయలుదేరాడు. రైనమ్మట ఫిష్ప్లేట్లూ జాయింట్లూ చూసుగుంటూ పోతున్నాడు. స్లీపర్ల దగ్గర సీలలు కదిలినట్టుంటేసుత్తితో బిగిస్తూ అక్కడక్కడ ప్లేట్ల స్క్రూలు బిగిస్తూ పోతున్నాడు.

సరిగ్గా నూటపన్నెండో మైలుదగ్గర 343 నెంబరు బ్రిడ్జి వున్నది. అక్కడి కొచ్చేసరికి వరసగా పది పదిహేను స్లీపర్లు లాగేసి వున్నాయి. రెండు పట్టాలకు బోల్టులు విప్పేసి వున్నాయి.

అది చూసేసరికి గంగయ్య గుండె పగిలిపోయింది. ఎవరో దుండగుల పని అయి వుంటుంది. దేశద్రోహుల పని అయి వుంటుంది.

మొదట్లో భయం వలన ఏం చెయ్యడానికి తోచలేదు. మళ్ళీ అలో చించుగొని అటూ ఇటూ కొంత దూరంలో పటాకీలు (డిటనేటర్లు ప్రమాద సమయంలో ఇంజన్ డ్రయివరుకు ప్రమాదాన్ని సూచించేవి) కట్టేసి పరిగెట్టేడు రైలు స్టేషన్కి.

సరిగ్గా మెయిలు రావడానికి అదే వేళ—పట్టాల ప్రక్కనుండి పరుగెడుతూవుంటే మెట్లంగి రాళ్ళ కొసలు కత్తి అంచుల్లా తగుల్తున్నాయి. సగం దూరం పరుగెట్టేసరికి ఒక జోడు తెగిపోయింది. రెండోజోడు అక్కడే విసిరేసి పరుగెట్టాడు. పాదాలు కొట్టుకుపోతున్నాయి. అక్కడక్కడా రక్తం చిందుతూంది. అయినా లెక్కచెయ్యలేదు. ఎట్లాగయినా మెయిలు రాకుండా ఆపాలి.

స్టేషన్ చేరేటప్పటికి మెయిలు బయలుదేర పోతూవుంది. చిన్న దొరగారు అట్నుంచి ట్రాలీమీద వస్తూండడం చూశాడు. ఒగుర్చుకుంటూ ఎ. పి. డబ్ల్యు. ఇన్‌స్పెక్టర్ దగ్గరికి వెళ్ళి పడ్డాడు. ఆయాసంతో అంతా చెప్పి, మెయిలు ఆపమన్నాడు.

ఆ ఇన్స్పెక్టరు గంగయ్య చెప్పిందంతా విని గబగబా దిగి, మెయిలు డ్రయివరును ఆగమని చెప్పి, స్టేషను మాష్టరు దగ్గరకు వెళ్ళి మళ్ళీ లైను బాగుచేసి చెప్పేవరకూ ఏ బండినీ వదలవద్దని చెప్పి తను ట్రాలీమీద సరంజామాతో బయలుదేరాడు జరిగిన స్థలానికి.

అతను తిరిగివచ్చి ట్రాక్ సర్టిఫికెట్ ఇచ్చేవరకూ రమారమి, అయిదారు గంటలు వుండిపోయింది మెయిలు. పెద్ద పెద్ద వాళ్ళందరకూ తెలిసింది హెడ్ ఆఫీస్ వరకూ వెళ్ళింది.

కాని అందరూ ఆ ఇన్స్పెక్టర్ ఇదంతా చేసినట్టే తెలుసు ఆ వెనక గంగయ్య అనే ఒక అల్పమయిన గ్యాంగు జీవి వున్నాడని తెలియదు—

"ఫలానా దగ్గర దుండగులు పట్టాలు విప్పేసినట్టు, ఆ సంగతి ఫలానా ఇనస్పెక్టరు ముందుగా తెలుసుకొని, వచ్చి మెయిలు ట్రయినును ఆపి ఏ దుర్ఘటనా జరుగకుండా పెద్ద ప్రమాదాన్ని రక్షించడం జరిగింది" అని రిపోర్టు వెళ్ళింది.

గ్యాంగుమన్ గంగయ్య ప్రశంసే లేదు...ఎవరికి తెలుసు?

మరో రెండు మూడు నెలలు తిరగకుండానే ఆ ఎ.పి.డబ్ల్యు. ఇనస్పెక్టరుగారిని జనరల్ మానేజరుగారు స్వయంగా పిలిపించి మెచ్చుకున్నారు,

"ఉద్యోగ నిర్వహణలో ఎంతో జాగ్రత్త చూపి, ముందుగా, సమయానికి తెలుసుకోనడంవలన పెద్ద రైలు ప్రమాదం తప్పిపోయింది. అతని జాగ్రత్తవలన ఎందరి ధన ప్రాణాలో కాపాడబడడమే కాకుండా,

ప్రభుత్వానికి ఎంతో లాభమయింది. ఇటువంటివారు, ప్రభుత్వానికి కావలసినవారు...ఇటువంటివారు ప్రజలకు సాటి ఉద్యోగస్తులకు, దేశానికీ కూడా ఆదర్శప్రాయులు" అని సర్టిఫికెటు ఇచ్చి, అయిదువందల రూపాయలు బహూమతియ్యడమే కాకుండా పి. డబ్ల్యుగా ప్రమోట్ చేశారు.

అమాయకుడు గంగయ్య అదంతా చూస్తూనే వున్నాడు. అన్నీ వింటూనే వున్నాడు...కాని ఏం చేయగలడు?...అసలు చూసింది తను. చెప్పింది తను. తన మూలంగా ఆ ప్రమాదం తప్పింది...కాని తనకేం ఒరిగింది...తననెవరూ మాట మాత్రంకూడా మెచ్చుకోలేదే!...తనపని తానూ చేశాడు. తనకన్నా పెద్ద అధికారికి తను చెప్పేడు. అంతకన్నా ఏం చేయగలడు? వ్రాయడం వచ్చునా? చదవడం వచ్చునా? ఆ అధికారి స్వార్థంతో మోసం చేస్తాడని అనుకోలేదు.

ఇప్పుడతని మొర ఎవరు వింటారు?

ఏ కష్టమూ లేకుండానే ఆ ఇన్‌స్పెక్టరుకు ప్రమోషన్ వచ్చింది.

అయినా తన దురదృష్టానికి ఒకర్ని అని ఏం ప్రయోజనం?... ఎవరు తప్పించగలరు! పోనీ ఆయన్నైనా బ్రతకనీ, బీదవాళ్ళ బ్రతుకు లెప్పుడూ ఇంతే, గొప్పవాళ్ళకే అన్ని అదృష్టాలూను...అని అనుకున్నాడు-అక్కడికీ కొందరి ప్రోత్సాహంచేత ఆ స్టేషన్ మాష్టర్ని వెళ్ళి అడిగాడు-జరిగినది చెప్పి- కాని అతను "చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ఏం లాభం?" అని పెదవి విరిచాడు. ఈ చెప్పినది ఆ రోజుననే తనతో చెబితే-

"గంగయ్య చూసి ప్రమాదం నివారించాడని రిపోర్టు పంపి వుండేవాడిని. అప్పుడు గంగయ్యకే లభించి వుండేదని" చెప్పేడు.

"అయితే నే చెప్పినట్టు మా ఇన్‌స్పెక్టరుబాబు చెప్పలేదా?" అని అమాయకంగా అడిగేడు.

"లేదు...అప్పుడు...నీ విషయమే ఎత్తలేదు... స్వయంగా ఆయన చూసి చెప్పినట్టే చెప్పేడు. అందుకని ఆయన పేరే బయటికి వచ్చింది" అని అన్నాడు.

ఇంకేం చేయగలడు? తనమీద అధికారి ఇన్స్పెక్టరుకు చెబితే తను చెప్పినట్టే రిపోర్టు ఇస్తాడని నమ్మేడుగాని ఇలా చేస్తాడని అనుకున్నాడా? పోని తనకు కాకపోతే తన కొడుకుకయినా ఈ విధాన్ని నౌఖరీ అవుతుందేమో అనుకున్నాడు...గాని అలాటిదేమీ జరుగకపోయే సరికి ఆశ్చర్యపోవడం తప్పించి మరేం చేయలేకపోయినాడు.

ఆ విధంగా ఆనాడు అతనికి అదృష్టం వక్రించింది.

నాటికీ నేటికీ ఒక్కలాగే వున్నాడు...గ్యాంగుమన్‌గా ప్రవేశించి గ్యాంగుమన్‌గానే రిటైరయినాడు...

ఇలా అనుకుంటూ నడుస్తూండగానే నూట పదమూడో మైలు దగ్గర లెవల్ క్రాసింగ్ గేటు దగ్గరికి వచ్చేడు. అక్కడే ఎల్లమ్మ "టీ" దుకాణం వుంది. అప్పటికి బాగా ప్రొద్దెక్కింది. ఎండ చుర్రుమంటూంది. ఇంకా మైలున్నర నడిస్తే వూరు చేరుకుంటాడు.

ఎల్లమ్మ టీ కొట్లో చెంబుడు నీళ్ళడిగి మొహం కడుక్కున్నాడు. తలపాగాతో తుడుచుకొని పది పైసలిచ్చి "టీ" తాగాడు. ఎప్పుడు గ్యాంగు పనికొచ్చినా ఎల్లమ్మ కొట్టులోనే కాతా. జీతాలు అందేక జమ కట్టేసేవాడు. రిటైరయినాక కాతా మానేసేడు...తాను మానేడం ఏమిటి? అదే పోయింది. తను ఇమ్మంటే మాత్రం ఇప్పుడిస్తారా?

వేడి వేడి పెసరట్లు, కుడుం ముక్కలూ, అందరూ తింటుంటే నోరూరిందిగాని...మరి డబ్బుల్లేక లేచిపోయాడు. నోరు చప్పరించు కుంటూనే రోడ్డుమీంచి పోలేదు, తన అలవాటు ప్రకారం లైను పట్టాల మీద నడుస్తూ పోతున్నాడు. లైనుమీద రైలు వెళుతున్నట్టే, ఒరిగి పోకుండా వెళ్ళిపోతున్నాడు...టెలిగ్రాఫ్ స్థంభాలమీద పక్షులు ఎగిరి పోతున్నాయి.

ఇంకెంతసేపు ఆ కులాయి తిరగ్గానే లక్ష్మింపురం, అనుకుంటూ గబగబా పోతున్నాడు. నడుస్తున్న వాడల్లా ఒక దగ్గర పట్టీలవంక చూస్తూ నిలబడిపోయాడు. అడుగు ముందుకు పడలేదు. ఒక పట్టీ బ్రద్ద లయి పోయింది...అది రైల్ ఫ్రాక్చర్!

చూశాడు గంగయ్య! ఇప్పుడు తను ఏ గాంగులోనూ పని చేయడంలేదు! తనెవరికి చెప్పకపోయినా తననెవరూ అడిగేవారులేరు!... తనకేం పోయింది?...యిప్పుడు తనపని మానుకుని స్టేషన్‌కు వెళ్ళి చెప్పాలా? అట్లా అయితే తను మరి లక్ష్మింపురం, ఈ పూట వెళ్ళలేడు. తనపని జరుగదు అయినా, తనెందుకింత బాధపడాలి?...ఈ రైల్వే ఎట్లాపోతే తనకేం?

చెప్పినా తనకేం లాభం? ఎవరో ఇన్‌స్పెక్టరుకు దీనివల్ల ప్రమోషన్ వస్తుంది. డబ్బిస్తారు?

ట్రయిను లైనుమీద నడుస్తుంది. ఆ లైనుక్రింద స్లీపర్లు లేకపోతే మోయలేదు...అయినా వాట్టి కర్రవాక్కలయిన స్లీపర్ల విలువ ఎవడికి తెలుసు? అలాటి స్లీపర్లలాటి వాళ్ళే గ్యాంగువాళ్ళూను, వాళ్ళు లేకపోతే రైల్వే లేదంటే అతిశయోక్తిలేదు...కాని...వాళ్ళ విలువ ఎవరికి కావాలి?

ఒకనాడు తనెంత బాధపడి... చెప్పినదీ... దానికి జరిగిన అన్యాయం తను ఎన్నటికీ మరిచిపోలేడు...ఆ సంఘటన తలుచుకుంటే తనలో మంటలు రేపుతుంది. "యెదవలు ఎవరెలాపోతే - నాకేంటి?" అని అనుకుని ముందుకు నడిచేడు.

దూరంగా ఎక్స్‌ప్రెస్‌కూత వినిపించింది.

అడుగు ముందుకు పడలేదు గంగయ్యకు.

ఏమిటి తను ఆలోచిస్తున్నది?...అవతల వేలకొద్దీ ప్రాణాలను, వస్తువులను...మోసుకు వస్తున్న ఎక్స్‌ప్రెస్...వస్తూంది!... అందులో ఎంతమంది అమాయకులు వున్నారు...వారందరికీ మరో కొద్దిసేపటిలో ఏం జరుగుతుందో తెలుసా... తామెంతో సురక్షితంగా ప్రయాణం చేస్తున్నామనే భావిస్తున్నారు, హాయిగా గుండెలమీద చేతులు వేసుకుని... రైల్వేలో పనిచేస్తున్న వాళ్ళమీద నమ్మకముంచి ప్రయాణం చేస్తున్నారు. వృద్ధులు–పసిపాపలు! తల్లులు! తండ్రులు! తమ్ముళ్ళు, అన్నలు, అక్కలు, చెల్లెళ్ళు–ఎంతమంది?

కొత్తగా పెళ్ళిచేసుకొని-విహారయాత్ర చేసున్న దంపతులు-పట్నంలో ఆస్పత్రికి పోయి చేరుకుంటే బ్రతుకుతామేమో అని ఆశలు పెట్టుకున్న జబ్బువాళ్ళు, అత్తవారింటికి ఎన్నో కోర్కెలతో, వెళుతున్న క్రొత్త పెళ్ళి కూతుళ్ళు, మొదటి పురుడు పోసుకుని, పుట్టింటినుండి తీయని తలపులతో భర్త వద్దకు వెళుతున్న బాలెంతలూ, ఇంటర్వ్యూకి వెళుతున్న నిరుద్యోగులూ, ఏమూలో చెలరేగిన అశాంతిని అంతం చేయడానికి, దేశాన్ని రక్షించడానికి వెళుతున్న సైనికులూ...ఇలా ఎంతమందో... వీళ్ళందరూ తన మూర్ఖత్వానికి బలికావలసిందేనా?

ఎప్పుడో తనకు అన్యాయం జరిగిందని—ఇప్పుడు ఈ ఏమీ ఎరుగని అమాయకులమీద కసి తీర్చుకోవటమా? ఇదేనా తన బాధ్యత? ఈ బాధ్యత రైల్వేలో పనిచేస్తున్న వాళ్ళకే పరిమితంకాదు. ఆ తర్వాత కూడా వున్నది. ఈ ప్రమాదంవల్ల నష్టమంతా ప్రజలది. దేశానిది.

గంగయ్యలో మానవత్వం మేలుకుంది.

మళ్ళీ ఎక్స్‌ప్రెస్ కూత వినిపించింది.

మరి ఆలోచనలకు తావులేదు. తన చేతిలో "పతాకీలు" లేవు. వాటిని కట్టి ఎక్స్‌ప్రెస్ ఆపడానికి...వున్నదల్లా ఎర్ర తలపాగాఒక్కటే గబగబా తలపాగా విప్పేడు. ఊపుకుంటూ ఎక్స్‌ప్రెస్‌కి ఎదురుగుండా పరుగెట్టడం మొదలెట్టేడు.

ఒకప్పుడు-తాను పరుగెట్టినట్టు, ఇప్పుడుపరుగెట్టలేక పోతున్నాడు. వయసు మళ్ళిపోయిందేమో వూపిరి ఎగదోస్తూంది. గుండె ఆడడం లేదు. ఆయాసం ఎక్కువవుతోంది. అయినా ఆగలేదు...పరుగెడుతున్నాడు. పెద్ద రాయి కాలికి తగిలింది. దబ్బున పడ్డాడు. మోకాళ్ళూ, చేతులూ కొట్టుకు పోయాయి. ఏమయిందో చూసుకుందికి టైమ్‌లేదు. దులుపుకుని లేచాడు.

ఎక్స్‌ప్రెస్...వచ్చేస్తూంది...ఇంక పరుగెట్టలేక పోతున్నాడు. ఎక్స్‌ప్రెస్ వచ్చేస్తూంది. ఎక్కడలేని శక్తి తెచ్చుకుని కేకలు వేస్తూ... తలపాగాగుడ్డ-వూపుతూ అడ్డంగా వెళుతున్నాడు. కాళ్ళు లాగేస్తూ, దిగ

జారి పోతున్నాయి. కళ్ళు తిరిగిపోతున్నాయి. ఇంక పరుగెట్టలేక నిలబడి పోయాడు రెలుపట్టాల మధ్యగా.

ఎక్స్‌ప్రెస్ డ్రయివర్...చాలాదూరం నుండీ గంగయ్యను ఎర్ర గుడ్డ వూపుకుంటూ రావడం చూశాడేమో ట్రయిన్‌ని ఆపేశాడు.

అలా అకస్మాత్తుగా ఆగగానే—బండిలో అందరూ దిగి, ఇంజన్ దగ్గరికి వెళ్ళేరు. గంగయ్య చుట్టూ అందరూ మూగి అనేక ప్రశ్నలు వేస్తున్నారు. అంతలో గార్డు కూడా అక్కడకు వచ్చేడు.

"ఏమిటయింది?" అని ప్రశ్నించాడు.

డ్రయివర్ గంగయ్య వైపు చూపెట్టేడు.

"నేను గ్యాంగుమన్ రంగయ్యను బాబూ. రిటైరైపోనాను. ఈయేల పనుండి లచ్చింపురం యెల్తుంటే ఆ గులాయికాడ రైలు ఫ్రాక్చరు కన పడ్డాది. అది చూసి పరుగెత్తుకొచ్చి ఆపినాను" అని చెప్పేడు.

ఇంతలో జనాన్ని తోసుకుంటూ ఎవరో సూటులో వున్న వ్యక్తి వచ్చాడు. గార్డు, డ్రయివరూ అతనిని చూసి విష్ చేశారు. అతను ఛీఫ్ ఇంజనీరు. ఆ బండిలోనే ప్రయాణం చేస్తున్నాడు.

గంగయ్య చెప్పినదంతా అతనూ విన్నాడు. తన నోట్‌బుక్‌లో గంగయ్య పేరూ, పనిచేసిన గేంగు పేరూ, నెంబరూ అన్నీ వ్రాసుకుని, గంగయ్యను ఎంతో అభినందించాడు. దగ్గరకు వెళ్ళి ఆ ఫ్రాక్చర్ పరీక్ష చేసి అది ప్రమాదకర మయినందువల్ల తిరిగి వచ్చాడు. ఎంతమందో ప్రయాణీకులుకూడా అతని చేతులు పట్టుకొని ఆప్యాయంగా తడుతూ, అతనివల్ల ఎంతోమంది ప్రాణాలు రక్షించబడ్డాయని కృతజ్ఞత వెలి బుచ్చారు.

బండిని మళ్ళీ వచ్చిన స్టేషనుకే త్రిప్పివేశారు. ఇన్‌స్పెక్టర్ వాళ్ళు వెళ్ళి ఆ పట్టా మార్చాక వదిలారు.

గ్యాంగుమన్ గంగయ్య హృదయం—తేలిక పడింది. తనకు డబ్బు, హోదా, లేకపోతేనేం ? తను చేసిన ఈ మంచిపని చాలును ఈ జన్మకి! అనుకున్నాడు. ఒకసారి తను కష్టపడిన దానికి—తనకు లాభిం చిన దేమీలేదు. ఆనాడు...ప్రతిఫలాపేక్ష మనసును పీకింది...కానీ ఈ నాడూ అంతే అన్న నిరాశతో ఆ ప్రతిఫలం ఆశించకుండానే—తన విధి మానవునిగా తన కర్తవ్యం. తాను నిర్వహించాడు—అందుకే మన సంతా తృప్తితో నిండిపోయింది.

తనెలాగో రిటైర్ అయిపోయినాడు—తన కింకేమీ ఆశలేదు—తన కొడుక్కయినా నౌఖరీ దొరికితే చాలు. తను చేసిన మంచిపనికి. ఆ మాత్రం సహాయం లభించదా—అన్న ఆశ మాత్రం...ఏమూలో లేక పోలేదు...ఆ ఆశతో—ఎదురు చూస్తూనే వున్నాడు!...

ఆంధ్రజ్యోతి 21–8–70